ఆచారం అంటే అందరికీ యిష్టమే కాని ఆచారం అనే పేరుతో అనారోగ్యాన్ని కొని తెచ్చుకునే వారిని చూస్తే చాలా బాధగా వుంటుంది. కొందరు ఆచారం అనే బురఖా తగిలించుకుని చాటున అనాచారపు భాగవతం ఆడేవారూ వున్నారు. మరి కొందరు కేవలం పేరూ ప్రతిష్ఠల కోసం ఏమైనా సరే అని కఠినంగా మొండికి పడి ఆచారం కోసం పస్తులుండి ఒళ్లు పాడు చేసుకునే వారూ వున్నారు. మంచి నీళ్ళ బావిదగ్గర చేరే ఆడంగు లంతా ఆచారాన్ని గురించిన చర్చ లేందే నీళ్ళు చేంద బుజాని కెత్తరు గదా! అందులో ముఖ్యంగా విధవలు. ఒక నడివయసావిడ మరొక వయసు మళ్లినావిడ చెప్పుకోవటం "కక్కా నాకేమో వూరగాయజాడీ వేపు చీపురుపుల్ల తగిలినా చికాకేస్తుంది. వెంటనే ఆ జాడీ తీసి దిబ్బలో పారేయాల్సిందే! మా అత్తగారి ఆచారం నీకు తెలియంది కాదుగా. నేను కాస్త తోసేసుకున్నా ఆవిడగారు మండి పడేవారు కక్కా!....."

"ఆ పడతారమ్మా పడతారు. కూతుర్ని వియ్యాలగుల యింట్లో యిచ్చేప్పుడు ఆచారం ఏమైందో—నీకేం నిక్షేపంలాంటి కుటుంబంలో మంచి వచ్చావు. మీ అత్త చెందమ్మకంటే మీ వాళ్లే ఎక్కువ ఆచారవంతులని మా కక్కా అంటూ వుంటుంది......"

"అయ్యో ఆ మాట నేనని బ్రతగ్గలనా కక్కా! నోరు మూసుకుని పడుండాల్సిందే మా అత్తగారు తన కూతురు ఆచారాన్ని గురించి మాట్లాడుతూ వుంటే..."

"హోయబ్బ! ఎవరికి తెలియదు కూతురు ఆచారం! కిరస్తానీ వాళ్లలాంటి ఆడబిడ్డలు రెండు జడలు, కాళ్లకు చెప్పులు వేసుకుని వంటింట్లోకొచ్చి వడ్డించు అంటే పక్కన వేనలే వడ్డిస్తుందట. అలాటి ఆచారం మరి నీకూ నాకూ ఎల్లాగ వస్తుంది లే—అయినా మీరు మీరూ అత్తలూ కోడళ్ళూ. మధ్య నాకెందుకు లేయా గొడవలు. వెళ్లొస్తామ్మా—" అని నెమ్మదిగా ఎక్కడి వాళ్ళు అక్కడ జారుకుంటారు......

అసలు ఆచారాన్ని గురించి ఎక్కువగా మాట్లాడేవాళ్ళు ఆడవాళ్లు. అందులోనూ వయసు మళ్లిన వాళ్ళు ఎక్కువగా యీవిషయాలే మాట్లాడుతుంటారు. ఆచారాన్ని గురించి మాట్లాడే దానికంటే మరొకర్ని అనాచార్యులని ఆడిపోసుకోడంలో తృప్తి చెందుతుంటారు చాలా మంది ఆడవాళ్ళు. అలాటి వారి మధ్య ఖర్మంజాలక పడుచు సుమంగలీలు వుండటం తటస్థిస్తే యిబ్బందిలో పడతారు. పెద్దవాళ్ళ మాటలకు అవును అనాల్సిందే, యిష్టం లేకపోయినా. ఆచారాన్ని గురించిన ముసలివాళ్ళ లెక్చర్లు వినాల్సిందే విధిలేక. అలాటివని పడుచులు ఎదరైనావుంటే ముసలి గుంపంతా ఆ పడుచు పిల్లల్ని వెంటనే రాల్చి పోస్తారు. మరీ మడిమేళం, వడమంత్రం నీలుగు, గీర్వాణం, ధ్యానను—యిత్యాది మినపసున్ని వుండల్లాంటి అతగని మాటల్లో ఆడి పోసుకుంటారు. అర్థయంతో నైనా ఒక చెవ్వు ముసలివాళ్ళ కొప్ప చెపాల్సిందే. నా ఖర్మంజాలక ఒకసారి వయసుమళ్ళిన ముసలి విధవ మహాసభలో ఒంటరిగా చిక్కుకున్నాను. అదీ, ఒక బంధువులయింటి పెళ్ళి భోజనాల సందర్భంలో—లోపల వంటలు అవుతున్నాయి. ప్రఖ్యాత వంటవాళ్ళంతా మడికట్టి వంటచేస్తున్నారు. ఇల్లంతా సందడిగావుంది. కొత్తకోడళ్ళు అంతా పిల్లల్ని ఒళ్ళో వేసుకుని జోకొడుతూ పిచ్చాపాటీ మాట్లాడుతున్నారు. కొందరు పెళ్ళి కూతుర్ని, ఆమె నగల్ని విలువకడుతున్నారు. మగవాళ్ళంతా పెళ్ళికొడుకుతోసహా మేడమీద కూర్చొని రేడియో వింటున్నారు—నాకు ఆయిల్లు, మనుషులు కొత్తకావడం వల్ల మా అత్తగార్ని అంటిపెట్టుకుని ఆవిడగారు ఎక్కడ కూర్చుంటే అక్కడ కూర్చోవలసి వచ్చింది—ఆవిడగారి పొతస్నేహి





ర-ర-యా

# అత్తగారూ — ఆచారాలూ —

## పి. భానుమతి





తు రాం(డు, తోడి కోడళ్లు, చెల్లెళ్ళు, వెలువిడిచిన మేనమామ మేనత్తల పిల్లలు ఓయబ్బ ఆలిస్టు ఆమెచెప్పాలి. అందరూ ముందు హాల్లో సభ తీర్చారు.

కొందరు వత్తులు చేస్తూ, కొందరు విస్తరాకులు కుడుతూ, మాటల్లోకి దిగారు- నేను ఒంటరిగా చిక్కుకున్నాను వాళ్ళందరిలోనూ. ఓమూలఒదిగి కూర్చుని వాళ్ళిమాటలన్నీ వింటం మొదలెట్టాను ... అక్కడున్న ముసలి వాళ్ళందరికి మా అత్తగారు అధ్యక్షురాలు. మాఅత్తగారి కంఠస్వరం తంజావూరు తంబురామందరస్థాయి అనవచ్చు మెల్లగా మాట్లాడితే — కొస్త గట్టిగా మాట్లాడినప్పుడు కలకత్తా మెయిలు యింజనుఅరుపే. ఆమె కంఠం ఎత్తి మాట్లాడుతుంటే కందిరీగలు ఘోషపెడుతున్నట్లుంటుంది. ఆమె చాలా ఆచారంగా వుంటుంటారు—ఆమె తనుచేసినవంట తప్పితే మరెవరు వండినా భోంచేయరు. కన్నకూతురు వంటచేసినా పనికిరాదు ఆమెకు. తనే వండుకోవాలి తనే తినాలి. మిగతాకూడా ఎవరికీ వుంచరు — అలా తను చేసుకోలేనినాడు పస్తు-నాలుగుపండ్లు తిని చెంబుడుపాలు తాగి పడుకుంటారు—కృష్ణాఅంటూ — ఆమెకు అప్పుడప్పుడు ఫిట్సు వస్తూవుంటాయి. తెలివి లేకుండా చాలా సేపు పడిపోతుంటుంది ఆమె—అలాంటి సమయంలో గొంతులో నీళ్ళుపోస్తేగాని తెలివిరాదు మరి—అటువంటి సందర్భంలో తను నీళ్ళు ఎల్లా గొంతులో పోసుకోగలదు?

వంటమనిషి వైష్ణవుడే అయివుండాలి. అతనువచ్చి కాసినినీళ్ళుగొంతులోపోయాలి. ఖర్మంజాలక ఒకరోజు అతడు సినిమాకెళ్లాడు. మా అత్తగారికి ఫిట్ వచ్చి పడిపోయారుట. నేనూ ఇంట్లోలేను ఆ సమయంలో. ఇంట్లోపనిమనిషి, పనికుర్రవాడు తప్పితే ఎవరూలేరు. ఎంతసేపటికీ తెలివిరాక గొంతు ఎండిపోయి గుటకలువేస్తుంటే వాళ్లు మరీ ఖంగారుపడిపోయారట. చివరకు ధైర్యం చేసి ఆమె ప్రాణం నిలపడంకోసం కాసిని నీళ్ళుతెచ్చి కొద్ది కొద్దిగా గొంతులో పోసిందిట పనిమనిషి. కళ్లుమూసుకునే ఒక్కొక్క గుక్క నీళ్లు తాగారట నెమ్మదిగా మా అత్తగారు. అప్పటికి కొస్త తెలివివచ్చి కళ్ళుతెరిచి చూస్తే అదృష్టవశాత్తు అప్పుడే సినిమాచూచి తిరిగివచ్చిన ఆ వైష్ణవ వంటాయన ఎదురుగుండా పట్టె నామాలతో మా అత్తగారి కళ్లపడ్డాడు — సాక్షాత్ ఆ వెంకటేశ్వరుడే నామాలతో తనెదట ప్రత్యక్షమైనట్లు, అతడు తెచ్చిన తీర్థమే తాను సేవించినట్లు మా అత్తగారు తృప్తిపడివుంటారు. బ్రతుకుజీవుడా అనుకున్నాం. ఆ సంగతి మళ్ళీ ఎవరూ బయట అనకుండా గప్-చిప్‌గా వుండిపోయాం — ఆవిడ ఆనాటి ఆచారవ్రత భంగాన్ని గుట్టుగా నే వుంచాం. ఎక్కడంటే అక్కడ ఫిట్ వచ్చి తెలివి లేకుండా పడిపోయేమనిషి యింత చాదస్తంగా వైష్ణవుడే రావాలి గొంతులో నీళ్లు పోయడానికి అంటే కుదుర్తుందా, లేక వైష్ణవులుండే చోటుచూచి ఆమెకు ఫిట్ వస్తుందా.

ఆనాడు మా అత్తగారు అధ్యక్షత వహించిన మహాసభలో మా అత్తగారి తోడికోడలు ఆరంభించారు ప్రసారం—"అమ్మణ్ణీ! నీవేమైనా అనుకో, యీ కొలప్పిల్లయినా నీ కోడలే నయం. మన వ్యాపార్ల గోచీపెట్టి చీర కట్టిందిముద్దుగా. దానికున్న పాటి బుద్ధికూడా మన సుబ్బలక్ష్మి త్తకోడలుకు లేదుగదా! అబ్బ!! ఛండాలంగా ఆ చీరకట్టేమిటీ, ఆ నీలుగేమిటి-వంటిల్లు వుంచే తీరేమిటి ఛ ఛ వాంతొస్తుందంటే నమ్ము" వెంటనే మా అత్తగారు "యిదుగో కనకం-ఆ అనాచారమ్మనిషి పేరు నా దగ్గిర ఎత్తకు. మనమూ మైల పడతాం వూరుకో" అన్నారు. ఇంతలో యింకొకామె, "అయినా కక్కే తెలీకడుగుతా గానీ అసలు నీకంటే ఆచారవంతురాలా



"ఓ మూల ఒదిగికూర్చుని వాళ్లమాట లన్నీ వింటం మొదలెట్టాను..."

## ★ అత్తగారూ-ఆచారాలూ- ★

అంట చెల్లమ్మ-అయ్యో, అయ్యో, ఏం ఎగిరి పడుతుంది, ఏం ఎగిరి పడుతుంది? ఆవిడచేసే హంగామా చూస్తే, ఒంటికి కారం రాచినట్లుంటుంది. హెవరికి తెలియదూంట? ఆవిడ ఆచారం"

"ఇదుగో అమృతం, దానిమాట నా దగ్గర లేవాక. దాని సంగతి నాకు తెలుసు. దాని మొగుడు రాయలసీమలో వుద్యోగం వెలగబెట్టి నప్పుడంతా తురకపిల్ల పొయ్యివెలిగిస్తే వంట చేసుకు తినే దా పీనుగు-దానికాచారం ఏమిటే? నిక్షేపంలాంటి అత్తగార్ని అడవులు పట్టించింది. దాని అబ్బగాడికి గతిలేక దానివెనక ఆడపిల్లలందర్నీ అయినకాడికి ఆరువేల నియోగులకిచ్చాడు. ఇంకా ఆచారం ఎక్కడా నా తలకాయ ఆచారం?"అని మా అత్తగారి దీర్ఘం విని "అయ్యొ అమ్మణ్నీ అంతటితో ఆగావేం. దాని తమ్ముడు మళయాళందాన్ని పెళ్లిచేసుకుని చెప్పకుండా పాలఘాటు వెళ్లిన సంగతి నీకూ తెలుసుగా?

"హా తెలియకేం?, తెలుసు. అంతే కాదు యీ నాడు ఆ మళయాళ ప్రీనుగ చేత వంటచేయించి భోంచేస్తూందట నీవు చెప్పిన ఆచారవంతురాలు."

"ఆ! నిజంగా-అయ్యొ ఖర్మమా? అంత నీచానికి పాల్పడిందా ఆ మనిషి. అన్నట్లు కక్కా నీకు మేనత్త ఆడబిడ్డో ఏదో అవుతుందిగదూ." వెంటనే మా అత్తగారిముఖం నల్లబడిపోయింది. -"ఆ-నాకేంగాదు. దాని అబ్బగాడు ఏనాడు పోయాడో ఆ నాడే వాళ్లకీ మాకూ తెగతెంపు లయిపోయాయి. ఆపీనుక్కూ నాకూ ఏ బాంధవ్యంలేదు—" అని ఖచ్చితంగా తేల్చేశారు మా అత్తగారు—ఎవరైనా ఒకరు ఆచారవంతులంటే మరొకరు ఒప్పుకునేట్లు లేరా సభలో. గంగాభాగీరధీసమానురాండ్రంతా-ఒకావిడవూరికే అంతసేపూ కూర్చొని వున్నట్లుండి ఏదో తనూ ఒక "న్యూస్" అందించాలనే వుత్సాహంతో "అయ్యో నా తెలివిమండా యిందాకట్నుంచీ ఆలోచించుతున్నా ఎక్కడా? ఎవరింటిపెళ్లిలోనా? అని. మన కృష్ణుడి పెళ్లికి రుక్మిణమ్మత్త వాళ్లింట్లో ఏం జరిగిందో తెలుసా? అని ఆవిడ అందరి ముఖాలూ చూచింది. ఎవరికైనా తెలిస్తే తన గొప్పతనం కాస్తా తగ్గిపోతుందనే భయంతో! అదృష్టవశాత్తూ ఎవరికీ ఆవిడ చెప్పబోయేది ఏమిటో తెలీక గుడ్లప్పచెప్పి ప్రశ్నార్థకంగా ఆవిణ్ణి చూచారు. వెంటనే ఆవిడ "ఇంకా నయం తెలీకపోవడమేమిటీ! ఊరంతా అట్టుడికిపోనేనూ ఆ రోజు జరిగిన గొడవకి! రుక్మిణమ్మ వాళ్ళ యింటి పెళ్ళి అంటే యీ గొడవ అందరికీ ఈ నాటికీ తెలుసే! ఏం చెప్పేది? ఆ రోజు మా తలలు వంగిపోయాయి. ఎందుకొచ్చామా యీ పెండ్లికి అని అదోలా అయిపోయింది. మా అమ్మ నాన్నా వాళ్ళు అసలే ఆచారవంతులు. వాళ్లు పచ్చి గంగ ముట్టలేదా యింట్లో— నాకూ ఆచారం ఎక్కువాయే ..." ఇంతలోకే మా అత్తగారు మధ్యలో 'కట్' చేశారు. ఆమె "ఇదిగో పేరిందేవి—ఆ చెప్పేదేదో త్వరగా చెప్పు కానీ, నీ ఆచారం నీ వాళ్ళ ఆచారాన్ని గురించి వూరికే వాక్కు. ఇంకానే బతికే వున్నాను."

అని ఒక చురుకు వేసే సరికి అక్కడ వున్న మిగతా వాళ్ళందరూ పేరిందేవమ్మకు కోపం వస్తుందేమో అని భయపడ్డారు కాని మాఅత్తగారు అధ్యక్షురాలు కావడంవల్ల పేరిందేవమ్మ మా అత్తగారి యీసడింపు గమనించకుండానే ముందుకు పోయింది. "ఆ—యింతకీ నే చెప్పొచ్చిందేమిటంటే ఆనాటి పెండ్లి సమయానికి వైష్ణవ వంటవాళ్ళు దొరక్క ఎవరినో తీసుకొచ్చి వాళ్ళ ముఖాన నామాలు పెట్టి నాటకం ఆడారట! రుక్మిణమ్మ వాళ్ళు—తర్వాత బయట పడ్డదా సంగతి. ఒక్కసారి పెళ్ళియిల్లు అంతా గుప్పుమన్నదనుకోండి. ఆనాటినుండీ యీనాటివరకు ఆ గడప తొక్కి పచ్చి మంచి నీళ్ళు ముడితే మీరు ఏ ఒట్టు పెడితే ఆ ఒట్టు—"

"అదేమిటి పిన్నీ! రుక్మిణమ్మ నీ పెత్తల్లి కొడలేగా పరాయిదా ఏమన్నానా? అట్టా

యింటిగుట్టు బయటేస్తారా ఎక్కడన్నా? ఎంతయినా నీ వాళ్ళన్న తర్వాత నీవు అంత కఠినంగా మాట్లాడ కూడదు, ఏమైనా సొంత మనుషుల్ని కొస్త."

"ఆ నాకేం సొంతమే — ఏనాడు నా కొడుక్కు దాని కూతుర్ని యివ్వలేదో ఆనాడే తెగ తెంపులు అయి పోయింది. ఆ అనాచారప్పి నుక్కు నా కొడుకు నచ్చలేదట.—హోయబ్బ, తన కూతురు కిరస్తానీ కళ్ళకు నా కొడుకు బ్రహ్మ తేజస్సు తీసిపోయిందట——


"ఎంతయినా నీ కొడుక్కంటే అ పిల్లే ఎక్కువ చదివిందిగా—అంది" ఒకావిడ. "ఆ చదివింది కిరస్తానీ చదువు — దాని చదువూ నా బతుకూ ఒకటే. నిక్షేపంలాగా నాకొడుకు లోయర్ గ్రేడు ప్యాసయి స్కూలు మాష్టరీ చేస్తూంటే ఏం తక్కువొచ్చిందంట? నా కొడుకు ఆచారవంతుడు. ఆ అనాచారప్పి నుక్కు నచ్చడు మరి—"అని మెటికలు విరిచింది. "అయినా కక్కీ నీ కోపం రాకుండా వుంటే అడుగుతాను చదువెక్కువా ఆచారం ఎక్కువా."

"చదువుకూ ఆచారానికి ఏం సంబంధం వుంది నీ కొడుకు మరీ బిళ్లగోచి, పిలక, బహుసనాతన మ్మనిషిలాగా వుంటాడాయ..."

ఆ మాటకు అవతలావిడికి కడుపు మండి పోయింది-"అవునే నాకొడుకు సనాతనుడే. వాడేకాదు, వాడబ్బ సనాతనుడు, వాళ్ళ తాత సనాతనుడు, వాళ్ళముత్తాత సనాతనుడు నీ వెవరైవే నా కొడుకును ఎగతాళి చేయడానికి వచ్చావు! నీలాగా నాకొడుకు కాఫీలు, సోడాలు తాగడనా! నీలాగా వ్యాపార్లింట్లో పుట్టి నియోగుల ఇంట్లో మెట్టలేదనా..."అని యుద్ధానికి లేచింది ఆవిడ. అక్కడవున్న సభలో నెమ్మదిగా కలకలం బయలుదేరింది. మా అత్తగారు ఈలాంటి విషయాల్లో తీర్పు చెప్పడానికి బదులు బహుషోగ్గా తప్పుకుంటారు. లోపల వంట ఎంతవరకయింది చూచివస్తానని గబగబ లోపలికెళ్లారు. ఇంకా ఆ సనాతనపు మనిషి తన కొడుకు గొప్పతనాన్ని చెబుతూ ఎదటావిణ్ణి రాల్చిపోస్తూనే వుంది-అంతా వింటూ కూర్చున్నారు. ఏమైనా ఎదురు మాట్లాడితే అందర్నీ వరస బెట్టి తిట్టే గయ్యాళిమనిషట ఆవిడ. తర్వాత మా అత్తగారు నా చెవులో శెలవిచ్చారు. ఈలోగా వున్నట్లుండి ఎవరో ఒకావిడ పరిగెత్తుకొచ్చి "కొంపమునిగింది ఎవడో శూద్ర వాడు అన్నం అండా అని తెలియక అన్నం అండాను ముట్టుకున్నాడుట—అది విన్న అక్కడివారందరూ గుడ్లు తేలవేసి "అయ్యో అయ్యో ఇప్పుడేంగతి?" అని గుండెలు బాదుకున్నారు. ఆచారం వెలక్కాయిలాగా గొంతు పట్టుకుందా క్షణంలో. "అయితే వండిన అండా అన్నం దిబ్బలో కుమ్మరించాల్సిందే?" అన్నది ఒకావిడ. ఇంతలో లోపల్నుండి మా అత్తగారు గబగబా వచ్చారు. ఆచారంలో అగ్రస్థానం వహించిన ఆమె ఏం శెలవిస్తుందో అటు వంటి క్లిష్ట పరిస్థితుల్లో అని అందరూ నోళ్లు తెరుచుకుని ఆవిడిని చూచారు. ఆమె యీలోగానే పరిస్థితులన్నీ ఆలోచించింది. అప్పటికే ఒంటిగంట దాటింది. అదా పెళ్ళియిల్లు, అందరికడుపుల్లో ఎలుకలు తవ్వుతున్నాయి. పిల్లాజెల్లా బంధువర్గం అంతా భోజనాలకోసం తహతహ లాడుతున్నారు—వాళ్లందరూ పస్తు పడుండాలి, అపూట అండా అన్నం దొర్లిస్తే-వెంటనే మాఅత్తగారు తన తంబురా మందర స్థాయిలో శెలవిచ్చారు -చూడూ కాకమ్మక్కా— చూసమ్మ పిన్నీ, వాడు అండా ముట్టుకొన్నాడు అంటున్నారే కాని నాకు నమ్మకం కలగడంలా-వాణ్ణి గట్టిగా గద్దించి అడిగితే చేతివేళ్లు తగిలాయండీ అని ఏడుపు మొగం పెట్టాడు వెధవ-నిజమే అయివుండవచ్చు బహుశా తాకివుండడు-అథవా ఆ వెధవ తాకడే అనుకో. ఇప్పుడొక్క పని చేయాలి మనం." "ఏమిటి కక్కీ ఏమిటి" అన్నారు అంతా!

"పురాణాల్లో చెప్పినట్లు అన్నం పరబ్రహ్మస్వరూపం అన్నారు పెద్దవాళ్ళు. అండా అన్నం దిబ్బలో కుమ్మరిస్తే మనకు మహాపాపం చుట్టుకుంటుంది-కాబట్టి కాస్త తులసితీర్థం ఆ అండామీద ప్రోక్షించి ఆ అండా అన్నం మనం భోంచేయవచ్చు-దోషంలేదు-" అని తీర్పు చెప్పారు మాఅత్తగారు-వెంటనే ఆపూట ఏకాదశి అవుతుందేమో అని భయంతో గుడ్లు తేలవేసిన ఆచారవంతులందరి ప్రాణాలూ లేచి వచ్చాయి. అందరూ ఏకగ్రీవంగా మాఅత్తగారి సమయోచిత ఆచార "అడ్జస్ట్‌మెంట్‌ను" వేనోళ్ళ పొగిడారు - ఆమె పురాణాలు చదివిన పుణ్యవతి అన్నారు అందులో కొందరు —(యింట్లో ఆ పురాణాల మధ్య డిటెక్టివ్ నవల్లూ సినిమా పత్రికలూకూడా వుంటాయని నాక్కూడా తెలుసు) ఏమైతేనేం ఆపూట మా అత్తగారు అందరినీ పస్తు పడుకోబెట్టకుండా వెంటనే ఆకులు వేయించి అండా అన్నం వడ్డించేందుకు అనుమతించారు.

ఏమిటే ఆచారం? సమయానికి తగ్గట్లు మార్చుకుంటూపోతారు. ఒక రేమనుకుంటారో అని మరొకరు ఆచారం. ఆచారం అని గంతులు వేయడమే తప్ప నిజంగా ఆచారం అనేది మీ దగ్గర లేదని నేను మా అత్తగారితో వాదిస్తుంటాను. "అయ్యో నీకేం తెలుసునే, నా ఆచారం. నేనుఎంతో మేలు. ఈ కాలం మనిషి నయిపోయాననే చెప్పాలి. మా చూడమ్మత్త బ్రతికున్నాళ్లు కొళాయి నీళ్లు తాగిందా? కాఫీ తాగినవాళ్ళతో మాట్లా



ఒకడు : L. T., B. ED లలో ఏది మంచి డిగ్రీ?

రెండో: BEDఅయితే హాయిగా పడుకొని నిద్రపోవచ్చు.

*   *   *

ఒకడు: తన్నేనంటే ముప్పైరెండు పండ్లు ఊడిపోతయ్! జాగ్రత్త!

రెండో: అన్నీ కట్టించుకున్న పండ్లే లెండి! తన్నటం దాకా ఎందుకు! వృధా శ్రమ. నెమ్మదిగా లాగినా వచ్చేస్తయ్!

—ఎల్. వెంకటేశ్వర్లు.

డిందా, సోడాలు, లెంజ్యాసులూ తాగిందా! కటిక ఆచారవంతురాలు గదంటే మా చూడమ్మత్త. అట్లా మా వల్లకూడా కాదు వుండడానికి. అయిపోయింది. నా ఘటం వున్నంతవరకూ యిట్లా పాకులాడుతాను. తర్వాత మీయిష్టం" అంటుంటుంది. ఆచారం కోసం మా అత్తగారు కొళాయి నీళ్లు తాకకుండా భావినీళ్ళు తాగుతారు. మా పెరట్లో వున్న భావినీళ్ళు వుప్పునీళ్ళు. దానికి తోడు బురదగా వుంటాయి. మానవమాత్రులు ఆ నీళ్ళు తాగలేరు కాని ఆ నీళ్ళు మా అత్తగారి ఆచారానికి అమృతప్రాయంగా వుంటాయి—ఆ నీళ్ళలో స్నానంచేసి ఆ నీళ్లే వంటకూ, తాగడానికి తెచ్చిపెట్టుకుంటుందావిడ—ఆ నీళ్ళతో పప్పు 4 గంటలయినా వుడకదు. పాపం ఆ వుడకని పప్పుతో నే భోంచేస్తుంటుంది కాని పంపునీళ్ళు తాకదు మైల అని. "భావి లేకుండా ఒట్టి పంపునీళ్లే వుంటే ఏం చేస్తారు?" అంటే "ఆ పంపుమీద కాస్త తులసితీర్థం చల్లి కృష్ణా అంటూ తాగాల్సిందే ఏం చేస్తాం?" అంటుంది—"మరింక తులసి తీర్థంతో పవిత్రమయ్యే పంపు నీళ్ళు యిప్పుడూ తాగవచ్చుగా!" అంటే "అదెట్లా? భావివుండగా నిక్షేపంలాగా ఆ మైలనీళ్ళెందుకే" అంటుంది. వుప్పు నీళ్ళ భావి నిక్షేపం అట!—సమయంవస్తే ఎంత ఆచారం అయినా తులసి తీర్థంతో పవిత్రం అవుతుంది, ఇది కేవలం చాదస్తమే. జరిగితే ఆచారం — జరక్కపోతే తులసితీర్థంలేక పోతే మరొకటి—ఏదో ఆ సమయానికి సర్దుకునే ఆచారం. అదేమిటండీ అంటే మా ఘటాలిట్లా తెల్లవారి పోనివ్వండీ — లేక

# ★ అత్తగారూ - ఆచారాలూ- ★

పోతే ఫలానా చూడమ్మ కోడలా? అనరటే అంటుంది. అదీ విషయం. ఫలానా ఆవిడ చాలా ఆచారంగా వుంటుంది, అనేపేరు కోసం యింత ప్రాకులాట. ఆచారం మా అత్తగారిలాంటి వాళ్ళ చేతుల్లో కీలుబొమ్మ. సమయంవస్తే ఎన్ని అవతారాలయినా ఎత్తుతుంది—మా అత్తగారు వుల్లిపాయలు ముట్టరు, ఆ వాసన పనికిరాదు. ఆలాంటి మనిషి ఒకరోజు మనుమడికి వులిపాయలు వేసి కూరవండి పెట్టింది. మా అందరికీ ఆశ్చర్యమై అదేమిటత్తా! అంటే "పోన్లేవే బిడ్డకి చేద్దామని ఆశగావుండి చేశాను. స్నానంచేసి, నా వంట చేసుకుంటే పోయే-" అన్నారు ఆవిడ. ప్రేమకు ఆచారం లేదు. తన మనసులో మనమడికోసం ఒక ప్రియమైన కూరవండిపెట్టడానికి కాసేపు ఆచారాన్ని ఒక వేపు పెట్టిందావిడ. నిజానికి ఆవిడా రోజు వుల్లిపాయ ముట్టిందని తెలిస్తే మిగతా ఆవిడ గారితోడికోడళ్లు వగైరా అంతా ఆవిడ్ని అల్లరి పెట్టేవారే.

నిజానికిమా అత్తగారిఆచారంచాలానయం. ఆవిడకంటె కఠినంగా ఆచారాన్ని ఆచరణలో పెట్టేవారే ఎక్కువమంది వున్నారు. నడుస్తూ నీళ్ళుచల్లుకుంటూ నడిచేవారు ఇప్పుడుకూడా వున్నారు—అతిఆచారం అనవసరం అంటుంది మాఅత్తగారు. వెనకటికి ఎవరో ఒక కటిక సనాతనపరుడు ఎండలో వెడుతూ దాహానికితట్టుకోలేక ఒకబ్రాహ్మణ యింటిముందు నిలచి మంచితీర్థం అన్నాట్ట. ఆయింటి యిల్లాలు చెంబుతో తెచ్చి ఇచ్చిందట. చెంబు ముట్టుకుంటే అనాచారం అని తాకకుండా మరొక ఇంటికి వెళ్లాట్ట—ఆ ఇంటి వాళ్ళు గ్లాసులో తెచ్చియిచ్చారట. గ్లాసు తాకితే మైలపడతానని అక్కడా నీళ్ళు తాకకుండా వెళ్ళిపోయాట్ట. ఆవిధంగా యింటింటికెళ్ళి నీళ్లు తాకకుండా నే దాహంతో వూరంతా తిరిగి ఎండకు తట్టుకోలేక చివరకొక మాలపల్లెముందు మైకంవచ్చి పడిపోయి చాలాసేపటికి కండ్లు తెరిచిచూస్తే ఒక గుడిసెలో మాదిగవాడిఒళ్లో పడుకుని చర్మంతో కుట్టిన ఒక చిన్నదొన్నెలోనీళ్ళు ఆమాదిగవాడుతననోట్లోపోస్తుంటే తను తాగుతున్నాడు. అది ఆచారానికి ఆఖరి మెట్టు. ఈకథ మాఅత్తగారే చెప్పారు — తమాషా అది - ఇలా చెబుతూ యింతా తెలిసీ చాదస్తంగా ఆచారం ఆచారం అని ఎందుకంతిఅవస్థలుపడతారు అంటే "అయ్యో నాదేం ఆచారమే—మా చూడమ్మ ఆచారంలో నా మొఖం నేను సగం జరుపుకోగలనటే," అంటుంది—మరుక్షణంలో ఫిట్ వచ్చి పడిపోతే గొంతులో నీళ్ళు ఎవరుపోసేది తెలియని మా అత్తగారి చాదస్తానికి నాకు నవ్వొస్తుంది. ★




ఎస్ట్రెలా బ్యాటరీలు లిమిటెడ్.,
బొంబాయి—మద్రాస్—ఢిల్లీ—నాగపూర్—కలకత్తా—కాన్‌పూర్
E-6